సాక్షి
నిర్మల్
శనివారం । 22 । ఫిబ్రవరి । 2025



మంచుకొండల్లో మనోడు
నిర్మల్‌కు చెందిన ఓ యువకుడు హిమాలయ పర్వతాల్లోని కేదరికంఠ్, సమ్మిట్ క్యాంప్ శిఖరాలు అధిరోహించాడు. ఎవరెస్ట్ శిఖరం ఎక్కడమే లక్ష్యమని తెలిపాడు. 8లో▸



ఊరూరా 'బెల్ట్' దందా
ఊరూరా విచ్చలవిడిగా బెల్ట్ షాపులు వెలుస్తున్నాయి. పల్లెల్లో బార్లను తలపించేలా సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తుండగా మందుబాబులు జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
35.0 /21.0

వాతావరణం
ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం ప్రకాశవంతంగా కనిపిస్తుంది. చలి తగ్గుతుంది.

న్యూస్‌రీల్

న్యాయనిర్ణేతగా ఎంపిక



శ్రీరాముల సాయికృష్ణ

భైంసాటౌన్: వుషూ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చండీగఢ్‌లోని యూనివర్సిటీలో ఈనెల 22 నుంచి 27 వరకు ఆలిండియా యూనివర్సిటీ వుషూ పోటీలు నిర్వహించనుండగా జాతీయస్థాయిలో 25 మంది గుర్తింపు పొందిన న్యాయనిర్ణేతలను ఎంపిక చేశారు. వీరిలో భైంసాకు చెందిన ఖేలో ఇండియా సెంటర్ కోచ్ శ్రీరాముల సాయికృష్ణ ఉన్నాడు. ఆమెచ్యూర్ వుషూ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ ఒమర్ తనను న్యాయనిర్ణేతగా ప్రకటించినట్లు సాయికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా సాయికృష్ణను పలువురు అభినందించారు.

మందకృష్ణకు సన్మానం



మందకృష్ణను సన్మానిస్తున్న కమలాకర్

ఖానాపూర్: పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగను శుక్రవారం ఖానాపూర్‌కు చెందిన రాహుల్ గాంధీ ఫాలోవర్స్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు శనిగారపు కమలాకర్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆల్ ఇండియా రాహుల్ గాంధీ ఫాలోవర్స్ ఫ్రంట్ చైర్మన్ మల్లు శివరాంతో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

పరీక్షలకు సన్నద్ధం చేయాలి



వంటలు పరిశీలిస్తున్న అభిలాష అభినవ్

మామడ: విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. శుక్రవారం మండలంలోని రాశిమెట్ల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాల, సరుకులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. పరిసరాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు వందశాతం హాజరయ్యేలా చూడాలని తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి చదువులో వెనుకబడినవారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, అధికారులు, ఉపాధ్యాయులున్నారు.

సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ధర్నా



ధర్నా చేస్తున్న వివిధ గ్రామాల రైతులు

లోకేశ్వరం: వ్యవసాయానికి విద్యుత్ కోత విధిస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం మండలంలోని మన్మద్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులు ధర్నా చేశారు. సబ్‌స్టేషన్ పరిధిలోని హావర్గ, మన్మద్, సాథ్‌గాం, ఎడ్దూర్, పోట్‌పల్లి, బిలోలి గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను ప్రతీరోజు రెండు గంటల పాటు నిలిపివేస్తున్నారని తెలిపారు. విషయం తెలుసుకున్న లోకేశ్వరం ఏఈ శివకుమార్ సబ్‌స్టేషన్‌కు చేరుకున్నారు. త్రీఫేజ్ సరఫరాలో ఎంత సమయం అంతరాయమేర్పడితే అంత సమయం రాత్రివేళ సరఫరా చేస్తామని హామీ ఇవ్వగా రైతులు ఆందోళన విరమించారు.

మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న రాజేందర్

నిర్మల్‌చైన్‌గేట్: గర్భిణులకు మెరుగైన సేవలందించాలని డీఎంహెచ్‌వో రాజేందర్ సూచించారు. శుక్రవారం ఇంటిగ్రేటెడ్ హైరిస్క్ ప్రెగ్నెంట్ ట్రాకింగ్ మేనేజ్‌మెంట్‌పై జిల్లాలోని మహిళా ఆరోగ్య సహాయకులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక పెన్షనర్ సంఘ భవనంలో నిర్వహించారు. వైద్యులు అఖిల, సంతోషిని ఆరోగ్య సహాయకులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. అధిక ప్రమాద గర్భిణులను వెంటనే గుర్తించి అవసరమైన సేవలు సమయానుకూలంగా అందిస్తూ ఇబ్బంది లేకుండా ప్రసవమయ్యేలా చూడాలని సూచించారు.

జిల్లాకు సీఎం



- 24న నిర్మల్‌లో పట్టభద్రులతో సమావేశం కానున్న రేవంత్‌రెడ్డి
- నరేందర్‌రెడ్డి కోసం ప్రచారం
- సక్సెస్‌కు నాయకుల కసరత్తు

నిర్మల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాకు రానున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 24న పట్టభద్రులతో సమావేశం కానున్నారు. నిర్మల్‌రూరల్ మండలం కొండాపూర్‌లో గల చంద్రశేఖర్ కన్వెన్షన్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు పేర్కొన్నారు. గతేడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్మల్‌సభకు వచ్చిన ముఖ్యమంత్రి ఆ తర్వాత మళ్లీ జిల్లాకు రాలేదు. ఇప్పుడు మళ్లీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికే సీఎం జిల్లాకు రానుండటం గమనార్హం. మరోవైపు పట్టభద్రుల స్థానాన్ని దక్కించుకునేందుకు జిల్లా కాంగ్రెస్ శ్రేణులు వర్గాలు, విబేధాలు పక్కనపెట్టి ఏకతాటిపైకి వచ్చాయి. ముఖ్యమంత్రి పాల్గొనే సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చాయి.

బీజేపీ ప్రభావాన్ని తగ్గించేందుకే!

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఆదిలాబాద్-నిజామాబాద్-కరీంనగర్-మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల స్థానం అభ్యర్థిగా అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి బరిలో ఉన్నారు. ఆయనకు మద్దతుగా ఇప్పటికే కాంగ్రెస్ ప్రచారం చేస్తోంది. ఇక జిల్లాలో మూడు నియోజకవర్గాలకు గాను ప్రధానమైన నిర్మల్, ముధోల్ రెండుచోట్ల బీజేపీ ఎమ్మెల్యేలున్నారు. ఖానాపూర్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నప్పటికీ ఆ నియోజకవర్గానికి సంబంధించి నాలుగు మండలాలు మాత్రమే జిల్లాలో ఉన్నాయి. బీజేపీ ప్రభావం తగ్గించడంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశం జిల్లాలో నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 24న సోమవారం మధ్యాహ్నం 12గంటలకు కొండాపూర్‌లోని చంద్రశేఖర్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. ఈ సమావేశాన్ని పట్టభద్రుల కోసమే నిర్వహిస్తున్నట్లు పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి.

చేతులు కలిపిన నేతలు

ఒకే పార్టీలో ఉంటున్నా.. ఎడమొహం పెడమొహంగా ఉన్న నేతలు ఒక్కతాటిపైకి వచ్చారు. కాంగ్రెస్‌లో వర్గాలుగా విడిపోయినవారిని ఒకరకంగా ఎమ్మెల్సీ ఎన్నికలు ఒక్కతాటిపైకి తీసుకువచ్చాయి. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్‌చక్రవర్తి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అర్జుమంద్‌అలీ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి బుధవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఒకే వేదికపైకి వచ్చారు. తాజాగా శుక్రవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లోనూ వారంతా కలిసే పాల్గొన్నారు. పార్టీ ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం కలిసి పనిచేస్తున్నట్లు చెబుతున్నారు.

ఎన్నికల ప్రచారానికే..

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేవంత్‌రెడ్డి రెండోసారి జిల్లాకు రానున్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 2024 మే 5న జిల్లాకేంద్రానికి వచ్చారు. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీతో పాటు ఆయన కూడా బహిరంగసభలో పాల్గొన్నారు. దాదాపు పదినెలల తర్వాత సీఎం జిల్లాకు రానున్నారు. కానీ.. ఈసారి కూడా ఎన్నికల ప్రచారంలో భాగంగానే వస్తుండటం గమనార్హం. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగానే కొండాపూర్‌లో సమావేశం కొనసాగనుంది. ముఖ్యమంత్రిగా రెండోసారి వస్తున్నా.. జిల్లాకు ఏం లాభం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పుడూ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఆయన జిల్లాకు వస్తుండగా ఎలాంటి అభివృద్ధి పనులకు అవకాశం లేదు.

సమావేశం విజయవంతం చేయండి

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 24న జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి రానున్నారని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు పేర్కొన్నారు. కొండాపూర్‌లోని చంద్రశేఖర్ కన్వెన్షన్‌లో మధ్యాహ్నం 12గంటలకు నిర్వహించే సమావేశానికి పట్టభద్రులు తరలిరావాలని కోరారు. స్థానిక మారుతీఇన్‌లో శుక్రవారం విత్తనాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి, మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగుల పక్షాన పోరాడింది కాంగ్రెస్ ఒక్కటేనని, అందుకే రాష్ట్రంలో అధికారాన్ని కట్టబెట్టారని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నోటిఫికేషన్లు ఇచ్చి, ఇప్పటివరకు 55వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. ఇప్పుడు ఎమ్మెల్సీ పట్టభద్రుల స్థానంలోనూ కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, విత్తనాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ అర్జుమంద్‌అలీ, ఏఎంసీ చైర్మన్లు భీంరెడ్డి, హాది, మున్సిపల్, గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్లు అప్పాల గణేశ్‌చక్రవర్తి, గంద్రత్ ఈశ్వర్, ఎర్రవోతు రాజేందర్, నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఎంబడి రాజేశ్వర్, నాందేడపు చిన్ను, అజర్, జునైద్, రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

'ఇంటిగ్రేటెడ్'కు శ్రీకారం



ఆదిలాబాద్‌రూరల్ మండలం నిషాన్‌ఘాట్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి కృష్ణ ఆదిత్య, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా (ఫైల్)

- ఇక యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు
- అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున..
- ఉమ్మడి జిల్లాలో 10 చోట్ల స్థలాల గుర్తింపు
- 2,500 మందికి విద్యనందించేలా వసతులు

కైలాస్‌నగర్: నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు శ్రీకారం చుట్టింది. ఒక్కో పాఠశాలలో 2,500 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు అన్ని సౌకర్యాలతో నాణ్యమైన విద్య అందించాలని సంకల్పించింది. ఇందుకోసం అసెంబ్లీ నియోజకవర్గానికో పాఠశాలను అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. ఈ మేరకు అవసరమైన స్థలాలను గుర్తించాల్సిందిగా కలెక్టర్లను ఆదేశించింది. ఇందులో భాగంగా రాష్ట్ర ఇంటర్మీడియెట్ బోర్డు కమిషనర్, ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి కృష్ణ ఆదిత్య బుధవారం స్వయంగా ఆదిలాబాద్‌కు చేరుకున్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో స్థలాల ఎంపికపై సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. వారి ఆదేశాలకు అనుగుణంగా పది నియోజకవర్గాల్లో ఆయా జిల్లాల అధికారులు అవసరమైన స్థలాలను గుర్తించారు. వివరాలతో కూడిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించారు. రాష్ట్ర సర్కారు తదుపరి ఆదేశాలకు అనుగుణంగా పరిపాలన మంజూరు అనుమతులు లభించిన వెంటనే పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

రూ.200 కోట్లతో భవనాల నిర్మాణం

పేద విద్యార్థులకు ఈ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు క్రీడలు, నైపుణ్యశిక్షణ అందించనున్నారు. ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయనున్నారు. తరగతి గదులు, వసతిగృహాలు, ఆట స్థలం వంటి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ఒక్కో పాఠశాలను 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. అత్యాధునిక హంగులతో భవన నిర్మాణాలు చేపట్టనున్నారు. రూ.200 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ నిర్మాణాలను వచ్చే రెండేళ్లలో పూర్తి చేసేలా కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు. అవసరమైన స్థలాలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు ఇప్పటికే ఎంపిక చేశారు. ఆయా జిల్లాల కలెక్టర్ల పర్యవేక్షణలో స్థలాల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గుర్తించిన స్థలాల వివరాలు

నియోజకవర్గం	గుర్తించిన ప్రాంతం	మండలం
ఆదిలాబాద్	నిషాన్‌ఘాట్	ఆదిలాబాద్‌రూరల్
బోథ్	అడెగామ	ఇచ్చోడ
ఖానాపూర్	పులిమడుగు	ఉట్నూర్
నిర్మల్	సిర్గాపూర్	దిలావర్‌పూర్
ఆసిఫాబాద్	ఇందాని	వాంకిడి
మంచిర్యాల	రెబ్బెనపల్లి	దండేపల్లి
బెల్లంపల్లి	గురుజాల	బెల్లంపల్లి
చెన్నూర్	సోమన్‌పల్లి	చెన్నూర్
ముథోల్	భైంసా	భైంసా
సిర్పూర్	చెడ్వాయి	పెంచికల్‌పేట్

కార్మికుల సంక్షేమమే ధ్యేయం



హెల్ప్‌డెస్క్ వద్ద మాట్లాడుతున్న స్వదేశ్

నిర్మల్‌ఖిల్లా: భవననిర్మాణ రంగ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని ప్రవాసీ మిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో వీరి కోసం ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో భవన నిర్మాణ రంగంలో వేలాదిమంది పని చేస్తున్నా సంక్షేమ బోర్డులో సభ్యత్వానికి నోచుకోలేకపోవడం బాధాకరన్నారు. గ్రామీణ కార్మికులు పంచాయతీ కార్యదర్శుల ధ్రువీకరణ, పట్టణ ప్రాంత కార్మికులకు వార్డు అధికారుల ధ్రువీకరణపత్రాల సేకరణలో ఆసక్తి చూపడం లేదని తెలిపారు. ఆన్‌లైన్ నమోదుకు సర్వర్ జాప్యం సమస్య ఏర్పడుతోందని, ఈ నేపథ్యంలో తమ సంఘం తరఫున తగిన సహాయ సహకారాలు అందించి తాము కార్మికులుగా పేర్లు నమోదు చేస్తున్నామని చెప్పారు. కార్మిక శాఖ తరఫున జిల్లాలో సహాయ కార్మిక అధికారులుగా నిర్మల్, భైంసా ప్రాంతాల్లో ఇన్‌చార్జీలు ఉండడంతో కార్డుల జారీ, క్లెయిమ్‌ల పరిష్కారంలో ఏళ్లపాటు జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఇందుకోసం కార్యాలయాల చుట్టూ తిరగలేక కార్మికులు విసిగిపోతున్నట్లు తమ సంఘం దృష్టికి వచ్చిందన్నారు. ప్రతీ భవన నిర్మాణరంగ కార్మికుడు ఈ-శ్రమ్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. కార్మిక సంక్షేమ బోర్డులో సభ్యత్వం ఉంటే ప్రమాద బీమా, వివాహ, ప్రసవ సమయాల్లో ప్రభుత్వం అందించే నగదు తదితర పథకాల ద్వారా లబ్ధి పొందవచ్చని పేర్కొన్నారు. భవన నిర్మాణ రంగ కార్మికులు తమ కార్యాలయాన్ని గాని లేదా హెల్ప్ డెస్క్‌ను 82475 11415 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. భవన నిర్మాణ సంఘం సొసైటీ అధ్యక్షుడు మోహన్, కార్యాలయ సమన్వయకర్త గీత, కార్మిక సంఘాల నాయకులు లావణ్య, బాలయ్య, లక్ష్మీనారాయణ, భాషా, షేక్ హకీం, డేవిడ్, స్వామి పాల్గొన్నారు.

'బెంబర'లో చిరుత సంచారం

- భయం గుప్పిట్లో జనం
- పాదముద్రలు గుర్తించి కెమెరాలు అమర్చిన అధికారులు



తానూరు: కెమెరా ఏర్పాటు చేస్తున్న అధికారి




భైంసారూరల్: పాదముద్ర కొలత తీస్తున్న అధికారి

తానూరు: మండలంలోని బెంబర అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తున్నట్లు స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. బెంబర గ్రామానికి చెందిన రైతు చుక్కబోట్ల సాయిలు బుధవారం దినమంతా ఆవులను మేపి పొలంలో కట్టేసి రాత్రికి ఇంటికి అన్నం తినేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో లేగ దూడను చిరుత చంపి తిన్నది. గురువారం ఉదయం గమనించిన సాయిలు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. బీట్ అధికారి వేణుగోపాల్ అక్కడికి చేరుకుని పాదముద్రలు పరిశీలించి చిరుత ఆనవాళ్లుగా గుర్తించారు. అటవీ ప్రాంతంలో కెమెరాలు ఏర్పాటు చేశారు. కాగా, బెంబర రైతులు పొలాలకు వెళ్లేందుకు జంకుతున్నారు.

సిరాల శివారులోనూ..

భైంసారూరల్: మండలంలోని సిరాల శివారులో చిరుత సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. శుక్రవారం భైంసా ఎఫ్ఆర్వో శంకర్ ఆధ్వర్యంలో సిబ్బంది సిరాలకు వెళ్లి వివరాలు సేకరించారు. గురువారం సాయంత్రం రైతు మహేశ్ గ్రామ శివారులోని తన మొక్కజొన్న చేనుకు నీటి తడి అందిస్తుండగా చిరుత కనిపించింది. భయపడ్డ అతడు ఊళ్లోకి వచ్చాడు. శుక్రవారం అధికారులు అతడితో చేను వద్దకు వెళ్లి చూడగా చిరుత పాదముద్రలు కనిపించాయి. పాదముద్రల కొలతలు తీసిన అటవీశాఖ అధికారులు చిరుతగా నిర్ధారించారు. సిరాల గుట్టల సమీపంలోనే చిరుతపులి ఉందన్న భయం ఆ గ్రామ రైతులకు నిద్రలేకుండా చేస్తోంది. శుక్రవారం పంట చేల వద్దకు వెళ్లేందుకు వణికిపోయారు. చిరుత సంచారంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భైంసా ఎఫ్ఆర్వో శంకర్ సూచించారు.

బాధితులకు అండగా ఉంటాం



కాలిన ఇండ్లు పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

పెంబి: అగ్ని ప్రమాద బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామని కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. మండలంలోని రాయదారి గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇండ్లు కాలిపోగా బాధితులను శుక్రవారం పరామర్శించారు. దుస్తులు, నిత్యావసరాలు అందించారు. తక్షణసాయంగా బాధితుల ఖాతాల్లో శనివారం రూ.లక్ష జమ చేస్తామని తెలిపారు. బాధితులు యథాస్థితికి వచ్చేదాకా భోజనం అందించాలని, బస చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఇళ్ల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు అవసరమై వివరాలు సేకరించాలని తెలిపారు. అనంతరం బాధితులతో కలిసి అక్కడే భోజనం చేశారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్, డీఎస్పో కిరణ్‌కుమార్, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో రమాకాంత్, సిబ్బంది ఉన్నారు.

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి

- ఎంపీ గోడం నగేశ్



భైంసాటౌన్: మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేశ్

భైంసాటౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే రామారావు పటేల్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని ఓటర్లకు వివరించి ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. నాయకులు రాజేశ్‌బాబు, గంగాధర్, పడిపెల్లి గంగాధర్, గోపాల్‌సర్డా, సాయినాథ్, మల్లేశ్వర్ ఉన్నారు.

బీజేపీతోనే మార్పు..

కుంటాల: బీజేపీతోనే మార్పు సాధ్యమని ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. మండలంలోని కల్లూరు, కుంటాల గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ బలపరిచిన పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొమురయ్యను గెలిపించాలని కోరారు. ముధోల్ ఇన్‌చార్జి హరినాయక్, మాజీ ఎంపీపీ గజ్జారాం, నాయకులు సాయినాథ్, నారాయణరెడ్డి, వెంగల్‌రావు, అశోక్‌కుమార్, రమేశ్‌గౌడ్, గజేందర్, సాయి సూర్యవంశీ, శేఖర్‌రావు, నవీన్, రమణారావు, గోవర్ధన్ తదితరులున్నారు.

పట్టభద్రుల భవిష్యత్ కోసం..

ముధోల్: పట్టభద్రుల భవిష్యత్ కోసం బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యను గెలిపించాలని ఎంపీ గోడం నగేశ్ కోరారు. మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించగా ఎంపీ పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలు పార్టీని గెలిపించేలా ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. పార్టీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న, జిల్లా కౌన్సిల్ సభ్యుడు భూమేశ్, ముధోల్ తాలూకా కన్వీనర్ సాయినాథ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మీనర్సాగౌడ్, నాయకులు సంతోష్, పోతన్న తదితరులున్నారు.

ఆర్జీయూకేటీలో అలరించిన నృత్యప్రదర్శన



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

బాసర: సైకాలజికల్ కౌన్సిలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో బాసర ఆర్జీయూకేటీని శాతవాహన గ్రౌండ్‌లో పీయూసీ ఫస్టియర్ విద్యార్థినులు నృత్యాలతో అందరినీ ఆకట్టుకున్నారు. సృజనాత్మకతతో ఏరోబిక్ విన్యాసాలు, హిప్ హాప్, శాస్త్రీయ నృత్యం, సంగీతానికి వారి ఆధునిక నృత్యాలు క్రోడీకరించి ప్రదర్శించారు. ఆర్జీయూకేటీ లోగోను మానవహారంగా ప్రదర్శించారు. వీసీ గోవర్ధన్, ప్రత్యేకాధికారి మురళీదర్శన్, ఏవో రణధీర్ సాగి, అసోసియేట్ డీన్, స్టూడెంట్ వెల్ఫేర్ నాగరాజు, అసోసియేట్ డీన్ సైన్స్ హ్యుమానిటీస్ విఠల్ విదార్థులను ప్రోత్సహించారు. కౌన్సిలర్ నాగలక్ష్మి, శ్రీలక్ష్మి తదితరులున్నారు.

'తాగునీటి సమస్య రానివ్వొద్దు'

నిర్మల్‌చైన్‌గేట్: వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య రానివ్వొద్దని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నీటి పొదుపు, వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పీహెచ్‌సీల్లో సరిపడా మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, జిల్లా అటవీశాఖ అధికారి నాగిని భాను, ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, జెడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, డీఎంహెచ్‌వో రాజేందర్, జేఏవో అంజిప్రసాద్, డీసీహెచ్‌వో సురేశ్, కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ఏర్పాట్లు, పోలింగ్ అధికారులు, సిబ్బంది గురించి తెలుసుకున్నారు. కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఎస్పీ జానకీ షర్మిల, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, జెడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు

కుభీర్: మండలంలోని జుమ్డ గ్రామంలో బాల్యవివాహాన్ని పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి.. భైంసా మండలం మహగాం గ్రామానికి చెందిన మైనర్ బాలిక(15)కు కుభీర్ మండలం జుమ్డ గ్రామానికి చెందిన యువకుడితో శుక్రవారం పెళ్లి చేయాలని నిశ్చయించారు. సమాచారం అందుకున్న ఐసీడీఎస్ అధికారులు, పోలీసులతో కలిసి వెళ్లి బాల్యవివాహాన్ని అడ్డుకున్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, ఏఎస్సై యశ్వంత్, తదితరులు ఉన్నారు.

చోరీకి యత్నించిన నిందితుడి రిమాండ్

కైలాస్‌నగర్: మహిళ మెడలో నుంచి పుస్తెల తాడు చోరీకి యత్నించిన నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన చిట్యాల విజయ ఈనెల 17న కాలనీలోని ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న తన మనుమడికి మధ్యాహ్న భోజనం చేయించి తిరిగివస్తుంది. తలమడుగు మండలం రుయ్యాడి గ్రామానికి చెందిన బేర వంశీ బైక్‌పై వచ్చి ఆమె మెడలో పుస్తెలతాడును లాక్కెళ్లేందుకు యత్నించాడు. మహిళ కేకలు వేయడంతో పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం స్థానిక నెహ్రూచౌక్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితుడిని అరెస్ట్ చేసినట్లు టూటౌన్ ఎస్సై తెలిపారు.

చిట్‌ఫండ్‌లో మోసం

- బాధితురాలి ఫిర్యాదుతో నలుగురిపై కేసు

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని భవిత చిట్‌ఫండ్ యాజమాన్యం డిపాజిటర్లకు డబ్బులు తిరిగి చెల్లించడంలో మోసం చేసింది. బాధితురాలి ఫిర్యాదుతో నలుగురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీలో ఉంటున్న హానోగు హారిక.. భవిత చిట్‌ఫండ్‌లో రూ.5 లక్షల చిట్టీ వేసింది. నెలకు రూ.10 వేల చొప్పున 50 నెలలు కట్టాల్సి ఉండగా 41 నెలలు రూ.4.10 లక్షలు చెల్లించింది. చిట్టీ ఎత్తుకునేందుకు 2022 అక్టోబర్‌లో కార్యాలయానికి వెళ్లగా అప్పటికే మూసివేశారు. యజమానుల సెల్ నంబర్లు తెలుసుకుని సంప్రదిస్తే కట్టిన డబ్బులు చెల్లిస్తామని కాలాయాపన చేశారు. తర్వాత చెక్కులు ఇవ్వగా చెక్‌బౌన్స్ అయ్యాయి. వారికి ఫోన్ చేస్తే స్విచ్ఛాప్ రావడంతో బాధితురాలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. యజమానులు మంచిర్యాలకు చెందిన గుండ ప్రకాశ్‌రావ్, తాడిపల్లి శ్రీనివాస్‌రావు, మేనేజర్లు సుషాంత్, సతీశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

టవరెక్కి భర్త హల్‌చల్

- భార్య కాపురానికి రావడం లేదని..
- ఉట్నూర్‌లో ఘటన


టవర్ ఎక్కి కూర్చున్న షకీల్

ఉట్నూర్‌రూరల్: భార్య కాపురానికి రావడం లేదని భర్త టవరెక్కి హల్‌చల్ చేశాడు. సీఐ మొగిలి కథనం ప్రకారం..మండల కేంద్రానికి చెందిన షకీల్ ఆయన భార్యకు గతకొన్నినెలలుగా గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో కుమురం భీం జిల్లా కెరమెరి మండల కేంద్రంలోని పుట్టింటికి వెళ్లి తిరిగిరాలేదు. భార్య కాపురానికి రావడం లేదని ఆవేదన చెందిన షకీల్ మండల కేంద్రంలోని అంగడిబజార్‌లోని టవరెక్కి ఆందోళన చేశాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు అక్కడికి చేరుకుని అతనికి సర్ది చెప్పినా వినలేదు. భార్యను పిలిపించడంతో టవర్ నుంచి దిగివచ్చాడు.

ఏళ్ల నిరీక్షణ.. టీచరైన వేళ..

- 17ఏళ్లకు ఫలించిన న్యాయ పోరాటం
- 2008 డీఎస్సీ అభ్యర్థులకు కొలువులు


నియామక పత్రాలు అందుకున్న ఉపాధ్యాయులు(ఫైల్)

మంచిర్యాలఅర్బన్: ఉద్యోగమనేది నిరుద్యోగుల కల. డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా ఎంపిక కావడంతో కల నెరవేరిందని అనుకున్నారు. తెల్లవారితే చాలు పోస్టింగ్ వచ్చేది. కోర్టులో కేసు పడడం.. దక్కినట్లే దక్కిన ఉద్యోగం చేజారడంతో కల చెదిరింది. ఒకటి రెండేళ్లు కాదు.. ఏకంగా 17ఏళ్లు వేచి చూశారు. ఎప్పటికైనా టీచర్ కల నెరవేరుతుందని ఆశించారు. న్యాయపోరాటం ఫలించడంతో కొలువులు దక్కించుకున్నారు. ఎట్టకేలకు హైకోర్టు ఉత్తర్వులతో డీఎస్సీ–2008 అభ్యర్థులు ఒప్పంద పద్ధతిన నియామక పత్రాలు అందుకున్నారు. ఇటీవల జిల్లాలో 12మందిని ఆయా పాఠశాలలకు కేటాయించారు. కాంట్రాక్టు పద్ధతిన నియామకంతోపాటు వేతనం అంతంతే కావడం వల్ల ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. జిల్లాలో ఆయా పాఠశాలల్లో డిప్యూటేషన్లపై టీచర్లను సర్దుబాటు చేసిన చోట కేటాయించాలని కోరుతున్నారు. ఒప్పంద నియామక పత్రాలు అందుకున్న కొందరిని 'సాక్షి' పలకరించింది. వారి మాటల్లోనే..

ఉద్యోగంతో ఊరట..



12ఏళ్లపాటు ప్రైవేట్ లెక్చరర్‌గా పనిచేశా. డీఎస్సీ 2008 నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగం వచ్చింది. కోర్టు కేసులో పడింది. అప్పటి నుంచి కోర్టు కేసులు, కలవని రాజకీయ నాయకులు లేరు. ఏదేమైనప్పటికీ ఇన్నేళ్ల నిరీక్షణ తర్వాత న్యాయం జరిగింది. ఉద్యోగం వచ్చిందనే సంతోషం ఉన్నా.. కాంట్రాక్టు బేసిక్‌లో టీచర్‌గా నియమించడం కొంత మేర నిరుత్సాహ పరిచింది. జీతం తక్కువ కావడం, మారుమూల ప్రాంత మండలాల్లో పోస్టింగ్‌లు ఇవ్వడంతో ట్రాన్స్‌పోర్టు ఇబ్బందిగా మారింది.

– కమలాకర్, ఎంపీపీఎస్ ఎస్టీ కాలనీ ముల్కలపేట్, మం: వేమనపల్లి

చాలా సంతోషంగా ఉంది



చిన్నప్పటి నుంచి టీచర్ ఉద్యోగం ఓ కల. డీఎస్సీ–2008లో టీచర్ ఉద్యోగం వచ్చినట్లే వచ్చి చేజారిపోవడంతో అప్పటి నుంచి ప్రైవేట్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాను. ప్రభుత్వ టీచర్ కంటే ప్రైవేట్‌లో పని ఒత్తిడి ఎక్కువ. ఆదివారం, సెలవుదినం పాటించడం అక్కడ తక్కువే. సరిపోని జీతాలతో ఇన్నాళ్లు ఎన్నో ఇక్కట్లు పడ్డాం. ఇన్నేళ్ల తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్(కాంట్రాక్టు పద్ధతిన) బాధ్యతలు నిర్వహించడం సంతోషంగా ఉంది. వేమనపల్లి మండలం ఎంపీపీఎస్ గోర్లపల్లి పాఠశాలలో నాకు పోస్టింగ్ ఇచ్చారు.

– యుగంధర్, ఎంపీపీఎస్ గోర్లపల్లి, మం: వేమనపల్లి

అర్హత సాధించినా..



కోటపల్లి: మా స్వగ్రామం కోటపల్లి మండలం సిర్సా. డీఎస్సీ అర్హత సాధించి 17ఏళ్లపాటు నిరీక్షించడం తలుచుకుంటే అసలు మాకు ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం వస్తుందా అనే అనుమానం కలిగేది. కోర్టు తీర్పుతో మాలో ధైర్యం వచ్చింది. ప్రభుత్వం వెంటనే నియమాక పత్రం ఇవ్వడం సంతోషంగా ఉంది. ఇష్టమైన ఉపాధ్యాయ వృత్తిని చేపట్టాను. విద్యార్థులకు మంచి విద్య బోధించేందుకు కృషి చేస్తాను.

– మల్లారెడ్డి, ఉపాధ్యాయుడు

కష్టానికి ఫలితం దక్కింది



భీమారం: ఉపాధ్యాయుడిగా ఎంపిక కావాలని ఎంతో కష్టపడి చదువుకున్నాను. అందుకు ఆలస్యంగైనా దేవుడు కరుణించాడు. 2008 డీఎస్సీలో ఉపాధ్యాయుడిగా ఎంపికైనప్పటికీ కోర్టులో కేసు ఉన్నందున ఇన్నాళ్లు పోస్టింగ్ ఇవ్వ లేదు. తీర్పు మాకు అనుకూలంగా రావడంతో తెలంగాణ ప్రభుత్వం ఉపాధ్యాయునిగా మొదటి పోస్టింగ్ భీమారం ఇచ్చారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తాను.

– జంగ హరికృష్ణారెడ్డి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల బీసీ కాలనీ, భీమారం

ఆనందంగా ఉంది



జన్నారం: మేము మంచిర్యాల జిల్లా కేంద్రంలో నివాసం ఉంటున్నాం. ఎంతో ఆశతో 2008లో డీఎస్సీ రాశాం. అనివార్య కారణాల వల్ల ఇన్ని రోజులు పోస్టింగ్ ఇవ్వలేదు. ఎట్టకేలకు ప్రభుత్వం మాకు పోస్టింగ్‌లు ఇవ్వడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం కాంట్రాక్టు పద్ధతిలో లోత్రొర్రె ప్రాథమిక పాఠశాలలో చేరాను. ప్రభుత్వం ఆలోచించి మమ్ములను రెగ్యులర్ చేయాలని కోరుతున్నాం.

– కుమారస్వామి, ఉపాధ్యాయుడు, లోత్రొర్రె

తండావాసి..శాస్త్రవేత్తగా

- మహాతండాకు చెందిన ఆకాశ్
- అభినందించిన గ్రామస్తులు


కుటుంబసభ్యులతో చౌహాన్ ఆకాశ్

నార్నూర్: అతనికి కాన్వెంట్ చదువులంటే తెలియదు. కార్పొరేట్ కళాశాలలో చేరలేదు. లక్షల రూపాయలు వెచ్చించి శిక్షణ పొందలేదు. పట్టుదలతో చదివి తన కల సాకారం చేసుకుని శాస్త్రవేత్త అయ్యి యువతకు ఆదర్శంగా నిలిచాడు. ఆయనే నార్నూర్ మండలంలోని మహాగావ్ తండాకు చెందిన చౌహాన్ ఆకాశ్. ప్రతిష్టాత్మకమైన రీసెర్చ్ అసోసియేట్ సైంటిస్ట్ సెంటర్ ఫర్ మెటీరియల్స్ ఫర్ ఎలక్ట్రానిక్ టెక్నాలజీ (సీ–మెట్), హైదరాబాద్‌కు ఎంపికయ్యాడు. 15 రోజుల క్రితం శాస్త్రవేత్తగా విధులు చేరాడు. ఈయన తల్లిదండ్రులు జీజాబాయి, ప్రహ్లాద్. వీరికి ఇద్దరు సంతానం. వ్యవసాయం చేస్తూ వారిని కష్టపడి చదివించారు. చిన్న కుమారుడైన ఆకాశ్ 1 నుంచి పదో తరగతి వరకు నార్నూర్ ప్రభుత్వ పాఠశాలలో చదివాడు. ఐటీడీఏ సహకారంతో హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేశాడు. ఏఐఈఈఈ పరీక్ష రాసి ఆలిండియా స్థాయిలో 178వ ర్యాంకు సాధించి వరంగల్ నిట్‌లో బీటెక్ పూర్తిచేశాడు. అనంతరం హైదరాబాద్ సెంటర్ యూనివర్సిటీలో చేరి మెటీరియల్ ఇంజినీరింగ్‌లో ఐదేళ్లపాటు పరిశోధన చేశాడు. ప్రస్తుతం సీ–మెట్‌లో రీసెర్చ్ అసోసియేట్, సైంటిస్టుగా విధులు నిర్వహిస్తున్నాడు. తండా నుంచి శాస్త్రవేత్తగా ఎదిగిన ఆకాశ్‌ను గ్రామస్తులు అభినందించారు.

మంచుకొండల్లో మనోడు

- హిమాలయాలను అధిరోహించిన నిర్మల్ యువకుడు
- 12,500 అడుగుల ట్రెకింగ్ చేసిన ఆదిత్య


హిమాలయ శిఖరం అధిరోహించిన అనంతరం జాతీయ జెండాతో ఆదిత్య


కుడినుంచి రెండవ వ్యక్తి..

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువకుడు హిమాలయ పర్వతాల్లోని కేదరికంఠ్, సమ్మిట్ క్యాంప్ తదితర శిఖరాలను అధిరోహించాడు. జిల్లా కేంద్రంలోని బేస్తవార్‌పేట కాలనీకి చెందిన న్యాయవాది లక్కాకుల తుకారం కుమారుడు ఆదిత్య ప్రస్తుతం పంజాబ్ రాష్ట్రంలోని ఎల్‌పీయూ కళాశాలలో ఎంసీఏ అభ్యసిస్తున్నాడు. ఈనెల 8న ఇతను వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 300 మందితో కలిసి మంచు కొండల్లోని హిమాలయ పర్వత శిఖరాలను అధిరోహించే ప్రయత్నం మొదలుపెట్టాడు. 12న దాదాపు 12,500 అడుగుల ఎత్తున ఉన్న సమ్మిట్ క్యాంప్‌నకు చేరుకున్నాడు. విపరీతమైన మంచు, ఎముకలు కొరికే చలి మధ్యన ఐదు రాత్రులపాటు శ్రమించి లక్ష్యాన్ని చేరుకున్నట్లు తెలిపాడు. తెలంగాణ నుంచి 8 మంది వరకు లక్ష్యాన్ని చేరుకోగా ఇందులో నిర్మల్ జిల్లా వాసి ఉండడం విశేషం. ఆదిత్య గతంలోనూ బద్రీనాథ్, కేదరీనాథ్, వైష్ణోదేవి ఆలయాలను కాలినడకన సందర్శించారు. పర్వతారోహణ పూర్తయిన అనంతరం యూనివర్సల్ అడ్వెంచర్స్ వారితో ప్రత్యేక ధ్రువీకరణపత్రాన్ని స్వీకరించారు. రాబోయే రోజుల్లో ఎవరెస్టు శిఖరం ఎక్కడమే తన లక్ష్యమని పేర్కొన్నాడు.

ఏజెన్సీలో దొంగల హల్‌చల్


ఇంద్రవెల్లి: సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్న నిర్వాహకులు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. రాత్రి సమయంలో దొంగలు షాపుల షటర్ తాళాలు పగులగొట్టి నగదును ఎత్తుకెళ్తున్నారు. నార్నూర్ మండల కేంద్రంలో పది రోజుల వ్యవధిలో మూడు దొంగతనాలు జరిగాయి. వరుస ఘటనలు చోటుచేసుకుంటున్న పోలీసులు పెట్రోలింగ్ చేయడం లేదని విమర్శలు వస్తున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉట్నూర్ మండలం ఎక్స్‌రోడ్ వద్ద రెండు వైన్స్‌షాపులు, గాదిగూడ మండలం లోకారి(కే) గ్రామంలో ఫర్టిలైజర్, రెండు కిరాణషాపుల్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. దొంగలు షాపుల షటర్ తాళాలు పగులగొట్టారు. ఫర్టిలైజర్ షాపులో రూ.60 వేలు, కిరాణషాపుల్లో రూ.60 వేల నగదును ఎత్తుకెళ్లారని బాధితులు సంజీవ్‌గౌడ్, ప్రహ్లాద్ తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు గాదిగూడ్ ఎస్సై నాగ్‌నాథ్ తెలిపారు.

ఇంద్రవెల్లి: మండలంలోని ఈశ్వర్‌నగర్ సమీపంలో జై దుర్గ వైన్స్‌షాపులో గురువారం రాత్రి చోరీ జరిగింది. నిర్వాహకుడు ముండే బాబు..షాపు బంద్‌చేసి ఇంటికి వెళ్లాడు. దొంగలు గడ్డపారతో షెటర్ తాళం పగులగొట్టి సీసీ కెమెరాలు, మానిటర్‌ను ధ్వంసం చేశారు. మందు బాటిళ్లతోపాటు కౌంటర్‌లో నగదును ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్సై సునీల్ శుక్రవారం ఉదయం వైన్స్ షాపును పరిశీలించారు. సీసీ ఫుటేజీని నిర్వాహకులు పరిశీలించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


ప్రమాద వివరాలు ఆరా తీస్తున్న ఎస్సై

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. గుడిపేట శివారులో మంచిర్యాల వైపు వెళ్తున్న కారు లక్సెట్టిపేట వైపు వెళ్తున్న రెండు బైక్‌లను అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న మంచిర్యాలలోని హైటెక్‌సిటీ కాలనీకి చెందిన ఇందారపు శివప్రియ(49) అక్కడికక్కడే మృతి చెందింది. మరో బైక్ నడుపుతున్న చెన్నూర్ మండలం లింగంపల్లి పంచాయతీ కార్యదర్శి ఎండీ నయీమోద్దీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉంది. కాగా, శివప్రియ లక్సెట్టిపేట బాలికల గురుకుల పాఠశాలలో సంగీత ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. రాత్రి విద్యార్థుల స్టడీ అవర్స్ కోసం పాఠశాలకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. భర్త శివప్రసాద్ రెండేళ్ల క్రితం మృతి చెందగా శివప్రియకు 9వ తరగతి చదువుతున్న ఒక కుమారుడు ఉన్నాడు. రోడ్డు ప్రమాదం ఘటనతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఏర్పడగా, ఎస్సై సురేశ్ బందోబస్తు చర్యలు చేపట్టారు. ప్రమాద వివరాలపై ఆరా తీశారు. ఘటనకు కారణమైన కారుడ్రైవర్ సత్తయ్య పారిపోయే ప్రయత్నం చేయగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

మాలలను అణచివేస్తున్న సీఎం

- మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్


సమావేశంలో పాల్గొన్న మాల సంఘం నాయకులు

నిర్మల్‌టౌన్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ చేతిలో సీఎం రేవంత్ రెడ్డి పావుగా మారి మాలలను అణచివేస్తున్నాడని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవనంలో శుక్రవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తిగా మాదిగల పక్షంగా జరుగుతుందన్నారు. ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించకుండా అశాస్త్రీయమైన 2011 జనాభా లెక్కలతో వర్గీకరణను అసెంబ్లీలో ఆమోదం చేశారని మండిపడ్డారు. వాస్తవానికి ఎస్సీల జనాభా 20% ఉందని, దానికి అనుగుణంగా రిజర్వేషన్లు 20% పెంచి వర్గీకరణ ప్రయత్నాలు చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అవలంబిస్తున్న వైఖరిని ఎండగట్టి, పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జైభీమ్ సైనిక్ దళ్ రాష్ట్ర కన్వీనర్ కనకరాజు, రాజన్న, గజెల్లి లక్ష్మణ్, బొడ్డు లక్ష్మణ్, వెంకటస్వామి, పురుషోత్తం, మురళీధర్, రవి, ప్రేమ్‌సాగర్, సదానందం, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి


దత్తురాం (ఫైల్)


దత్తురాం మృతదేహం

తానూరు: అడవి జంతుల బారి నుంచి పంట రక్షించేందుకు ఏర్పాటు చేసిన రక్షణ కవచమే యమపాశమైంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉమ్రి(కే) గ్రామానికి చెందిన కథం దత్తురాం (51), అంజనాబాయి దంపతులు. శుక్రవారం వారు కొందరు కూలీలతో కలిసి పంట చేను వద్దకు వెళ్లారు. దత్తురాం తాగునీరు తెచ్చేందుకు సమీపంలో ఉన్న పురుషోతం బోరుమోటారు వద్దకు వెళ్లాడు. నీరు పట్టుకునే క్రమంలో అడవి జంతుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు తగిలి అక్కడిక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించారు. సీఐ మల్లేశ్, ఎస్సై శ్రీనివాస్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.

నాగాపూర్‌లో కౌలు రైతు..

పెంబి: విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతిచెందిన ఘటన మండలంలోని నాగాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై హన్మాండ్లు కథనం ప్రకారం.. నాగాపూర్‌కు చెందిన రాపెని మైసయ్య (47) గ్రామ శివారులో మొక్కజొన్నను కౌలుకు తీసుకున్నాడు. శుక్రవారం పెద్ద కుమారుడు మహేశ్‌తో కలిసి మొక్కజొన్న చేను వద్దకు వెళ్లారు. అక్కడ విద్యుత్ బల్బు కోసం అమర్చిన జీ వైరుకు మైసయ్య చేతిలో ఉన్న కొడవలి తగిలి షాక్‌కు గురయ్యాడు. గమనించిన కుమారుడు తప్పించే ప్రయత్నం చేయగా తీవ్ర గాయాలయ్యాయి. మైసయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. గాయాలైన మహేశ్‌ను స్థానికులు ఖానాపూర్‌కు తరలించారు. భార్య భీమక్క ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

డబ్బుల కోసం వేధించిన వ్యక్తికి ఏడాది జైలు

నిర్మల్‌టౌన్: డబ్బుల కోసం వేధించిన వ్యక్తికి ఏడాది జైలుశిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం శుక్రవారం తీర్పు నిచ్చింది. కోర్టు సమన్వయల అధికారి డల్లుసింగ్ కథనం ప్రకారం..జిల్లాకేంద్రంలోని శాస్త్రినగర్ కాలనీకి చెందిన నర్సయ్య టైలర్‌గా పనిచేస్తున్నాడు. అవసరం నిమిత్తం లక్ష్మణచాంద మండలం కనకాపూర్‌కు చెందిన సతీశ్ వద్ద రూ.50 వేలు అప్పు తీసుకున్నాడు. తిరిగి రూ.39 వేలు చెల్లించాడు. మిగతా డబ్బుల కోసం సతీశ్ తరచూ టైలర్ షాపు వద్దకు వెళ్లి వేధించేవాడు. 2015 జూన్ 22న నర్సయ్య భార్య షాపులో ఉన్న సమయంలో అక్కడికి వచ్చి గొడవపడ్డాడు. ఆమెను గాయపర్చాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పీపీ వినోద్‌రావు సాక్షులను విచారించి నేరం రుజువు చేయడంతో న్యాయస్థానం ఈ మేరకు తీర్పునిచ్చింది.

ఆర్మీజవాన్‌పై కర్రలతో దాడి


గాయపడిన భోజరాజు

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడకు చెందిన ఆర్మీ జవాన్‌పై ఇద్దరు కర్రలతో దాడి చేసి గాయపర్చారు. ఎస్సై సాయికిరణ్ కథనం ప్రకారం.. ఆర్మీ జవాన్ మస్కిరి భోజరాజును పాత కక్షలను మనస్సులో పెట్టుకుని తిమ్మాపూర్ (జి) గ్రామానికి చెందిన గోస్కుల భూమయ్య, ఈర్ల పోశెట్టి గురువారం రాత్రి కర్రలతో దాడి చేశారు. ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి అన్న లక్ష్మణ్ ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆటోలో నుంచి పడి వ్యక్తి మృతి

తానూరు: ఆటోలో నుంచి పడి వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని సింగన్‌గాం గ్రామానికి చెందిన ఎల్మె దిలీప్ (37) మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. గురువారం పని నిమిత్తం తానూరుకు వచ్చాడు. పని ముగించుకుని స్వగ్రామానికి వెళ్లేందుకు మండల కేంద్రంలోని బస్టాప్ వద్ద ఆటోస్టాండ్‌కు వెళ్లాడు. అక్కడ ఆగి ఉన్న ఆటోలో పడుకున్నాడు. రాత్రి 8 గంటల ప్రాంతంలో ప్రమాదవశాత్తు రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య మంగళబాయి ఫిర్యాదుతో శుక్రవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు.

చికిత్సపొందుతూ ఒకరు..

ఆదిలాబాద్‌రూరల్: హెయిర్ కలర్ తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై విష్ణువర్ధన్ కథనం ప్రకారం.. మావల పోలీసుస్టేషన్ పరిధిలోని దస్నాపూర్ కాలనీకి చెందిన దామస్ విజయ్ (35) మేస్త్రీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత మూడు నెలల నుంచి కూలీ పని రావడం లేదు. దీంతో ఇతరుల వద్ద రూ.2 లక్షల అప్పు చేశాడు. తీర్చే మార్గం లేక మనస్తాపం చెందాడు. ఈనెల 18న శంకర్‌గుట్టలో హెయిర్ కలర్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు అతన్ని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు చంద్రకాంత్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు కారణాలతో ముగ్గురు బలవన్మరణాలకు పాల్పడ్డారు. తల్లిదండ్రులు మందలించారని కుమారుడు మద్యం మత్తులో పురుగుల మందు తాగగా, సీమంతం కార్యక్రమానికి తీసుకెళ్లలేదని వివాహిత ఉరేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

తల్లిదండ్రులు మందలించారని..


వెంకటేశ్ (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: తల్లిదండ్రులు మందలించారని కుమారుడు మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఉట్నూర్ సీఐ మొగిలి కథనం ప్రకారం.. మండలంలోని హస్నాపూర్‌కు చెందిన జాదవ్ బాలుసింగ్, రాధాబాయి దంపతులు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు జాదవ్ వెంకటేశ్ (26) పారామెడికల్ పూర్తి చేశాడు. ఉద్యోగం రాక ఎలాంటి పనులు చేయకుండా జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. గురువారం రాత్రి తల్లిదండ్రులు ఏం పనిచేయకుండా మద్యం తాగితే ఎలా అని మందలించారు. మద్యం మత్తులో వెంకటేశ్ ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి పడుకున్నాడు. శుక్రవారం ఉదయం తల్లి కుమారుడిని లేపగా ఎంతకీ లేవలేదు. కొడుకు మృతి చెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య


బెల్లెడ్ నవనీత (ఫైల్)

తానూరు: వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని బోల్సా గ్రామానికి చెందిన బెల్లెడ్ నవనీత (22)కు అదే గ్రామానికి చెందిన రాకేశ్‌తో గతేడాది వివాహమైంది. మూడు నెలల గర్భిణి అయిన నవనీతను ఇంటి వద్ద ఉంచి ఈనెల 20న భర్త రాకేశ్‌తోపాటు కుటుంబ సభ్యులు సారంగాపూర్ మండలం చించోలి (బి) గ్రామంలో సీమంతం కార్యక్రమానికి వెళ్లారు. తనను తీసుకెళ్లలేదని మనస్తాపంతో నవనీత గురువారం ఇంట్లో దూలానికి చీరతో ఉరేసుకుంది. సాయంత్రం ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. భర్త ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి..

సిర్పూర్(టి): సిర్పూర్(టి)–వేంపల్లి రైల్వేస్టేషన్ల మధ్యలో మండలంలోని ఆరెగూడ సమీపంలో శుక్రవారం రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సురేశ్ కథనం ప్రకారం.. మంచిర్యాల వైపు నుంచి బల్లార్షా వైపు వెళ్తున్న గుర్తుతెలియని రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వయస్సు 30 నుంచి 35 ఏళ్లు ఉంటుందని, బ్లాక్ కలర్‌ఫుల్ టీషర్ట్, బ్లూ కలర్ లోయర్ ధరించాడు. నడుముకు టవల్ చుట్టుకుని ఉన్నాడు. మృతదేహాన్ని కాగజ్‌నగర్ ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించి భద్రపర్చినట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే కాగజ్‌నగర్ రైల్వే పోలీసుస్టేషన్‌లో సమాచారం అందించాలని సూచించారు.